క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

తెలకపల్లి: మండలంలోని కార్వంగకు చెందిన చెందిన సైదమ్మ, పరశురాముడు దంపతుల 15 రోజుల కుమారుడికి గుండె ఆపరేషన్ కోసం రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్పందించి శుక్రవారం ఆపరేషన్ కోసం ఎల్‌ఓసీ మంజూరు చేసి ఆదుకున్నారు. ఆయన హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

బీసీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: బీసీ సంక్షేమం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ గౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ జిల్లా కమిటీలను ప్రకటించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణగౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా రమేష్

కందనూలు: టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా జిల్లా కేంద్రానికి చెందిన రమేష్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ కార్యదర్శిగా ఎండీ జాఫర్ ఎంపికయ్యారు.

మౌలిక వసతులు కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం జిల్లాలో ఉన్న వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హాస్టళ్లలో ఉన్న వసతులు అడిగి తెలుసుకున్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్పికస్, మధు, సురేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కల్వకుర్తిరూరల్: పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గుండూరులో వైద్య శిబిరం నిర్వహించి, 250 మందికి పరీక్షలు చేశారు. అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

స్నేహితుడికి ఆర్థికసాయం



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కేశవులుకు శుక్రవారం 2000–01 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశవులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, విషయం తెలుసుకున్న స్నేహితులు అండగా నిలిచారు. జెడ్పీహెచ్‌ఎస్‌కు పూర్వవిద్యార్థులు, స్నేహితులు చందాలు వేసుకొని ఆస్పత్రి ఖర్చులకు అందజేశారు. తంబాలు, ప్రవీణ్‌రెడ్డి, మల్లేష్, ఫారుక్, రవి తదితరులు ఉన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర విభజన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిన సీపీఐ నాయకులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. 2014 రాష్ట్ర విభజన సమయంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేశవులుగౌడ్, వార్ల వెంకటయ్య, కృష్ణా, శంకర్‌గౌడ్, శ్రీనివాసులు, శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విత్తనాల పంపిణీ

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలం ఆవంచకు చెందిన 10 మంది రైతులకు ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ శాస్త్రవేత్త డా.ప్రవీణ్‌కుమార్ సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యం విత్తనాలను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. చిరుధాన్యాల సాగుపై వ్యవసాయశాఖ నుంచి సూచనలు, సలహాలు ఉంటాయని.. వాటిని పాటించడమే కాకుండా చుట్టుపక్కల రైతులకు వాటి ప్రాముఖ్యతను వివరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, రైతులు సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దినేష్, నరేందర్, సత్యనారాయణ, చెన్నయ్య, శ్రీరాములు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను బెదిరించడం సరికాదు

రాష్ట్రంలో అన్ని పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పడితే వారిని బెదిరించడం సరైంది కాదని పంచాయతీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులకు ప్రభుత్వం పీఆర్‌సీని వర్తింపచేసి పంచాయతీ కార్మికులకు మాత్రం రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకుందని ఆరోపించారు. తక్షణం 30 శాతం పీఆర్‌సీని అమలు చేసి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని పంచాయతీల్లో ఒకే వేతనం అమలు చేయకుండా రకరకాల వేతనాలు అమలు చేస్తున్నారని, ఇప్పటికైనా మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

– సాక్షి, నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న నాయకులు



పెంట్లవెల్లిలో..



బిజినేపల్లిలో..

హామీల అమలులో కేంద్రం విఫలం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వార్ల వెంకటయ్య ఆరోపించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించే ఏఐవైఎఫ్ జాతీయ వర్క్ షాప్ సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నల్లధనం తిరిగి తెస్తామని, నిరుద్యోగం రూపుమాపుతామని చెప్పిన ప్రధాని మోడీ ఏదీ అమలు చేయలేదన్నారు. స్వచ్ఛభారత్ అంటూ ఎన్నో ప్రగల్భాలు పలికిన ఎన్‌డీఏ కూటమి దేశాన్ని అప్పుల పాలు చేశారని, నిరుద్యోగం పెరిగిపోయిందని ఆరోపించారు. వ్యవసాయరంగం సంక్షోభంలో ఉండి అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో అధికారం చేపట్టిన కేంద్ర బీజేపీ 9 ఏళ్లకాలంలో ప్రజాస్వామ్యాన్ని కూనీ చేశారని, హక్కులను హరింపజేశారన్నారు. హత్యలు, అత్యాచారాలు సాధారణమయ్యాయని, భావప్రకటనకు సంకెళ్లు పడ్డాయన్నారు. వీటన్నిటిపై హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ వర్క్‌షాప్‌లో చర్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివశంకర్, శ్రీనివాసులు, ఆంజనేయులు, మధుగౌడ్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

‘రైతుబంధు’ నగదు అందించాలి

- డీసీసీ అధ్యక్షుడు డా. వంశీకృష్ణ



మాట్లాడుతున్న డా. వంశీకృష్ణ

వెల్దండ: బ్యాంకు అధికారులు ఖాతాలో జమచేసిన రైతుబంధు డబ్బులు రైతులకు అందించి సాగుకు సహకరించాలని డీసీసీ అధ్యక్షుడు డా. వంశీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకొంటున్న కేసీఆర్ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. ప్రభుత్వం జమచేసిన డబ్బులను బ్యాంకు అధికారులు రుణాల పేరిట జమ చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పంట రుణమాఫీ హామీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు.

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని ఇచ్చి హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు.

లింగాల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రాథోడ్, నారాయణగౌడ్, మల్లయ్య, లక్ష్మణ్‌నాయక్, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలో వివిధ బ్యాంకుల ఎదుట కాంగ్రెస్ నిరసన కార్యక్రమం చేపట్టి బ్యాంకు మేనేజర్లకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హతపై స్టే కోసం వేసిన పిటీషన్‌ను గుజరాత్ హైకోర్టు విచారణకు స్వీకరించకుండానే తిరస్కరించడంపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉప్పునుంతల: రాహుల్ గాంధీ అనర్హత వేటుపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, కృష్ణ, శేఖర్‌గౌడ్, శ్రీనివాసులు, రాందాస్, మహేష్, జైపాల్, రామస్వామి, నిరంజన్, తిర్పతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పెద్దకొత్తపల్లిలో క్రిమి సంహారక మందులను పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దకొత్తపల్లి: గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా మురుగు కాల్వల్లో మలేరియా యాంటీ మందును చల్లారు. ఆయన మాట్లాడుతూ దోమలు కుడితే డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు దోమ తెరలు వాడాలని సూచించారు.

డ్రై డేను ప్రతి ఒక్కరూ పాటించాలి

మన్ననూర్: గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల వారు వారంలో ఒక రోజు తప్పనిసరిగా డ్రై డేను పాటించాలని హెల్త్ వర్కర్ జగన్ సూచించారు. శుక్రవారం మన్ననూర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయం సమీప కుటుంబాల వారి ఇళ్లకు వెళ్లి పరిసరాలను పరిశీలించడంతో పాటు నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. దోమలకు ఆస్కారం లేకుండా వారంలో ప్రతి శుక్రవారం తప్పకుండా డ్రై డేను పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.

కొల్లాపూర్ రూరల్: వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని అమరగిరిలో డ్రై డే నిర్వహించారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు ఉంచుకోవద్దని ప్రజలకు సూచించారు.

గుప్తనిధుల ముఠా పట్టివేత?

బల్మూర్: గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఓ ముఠాను గ్రామస్తులు గుర్తించి పట్టుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని మైలారంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామ శివారులోని శివాలయం సమీపంలో శుక్రవారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరుపుతుండగా గుర్తించిన గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. కొన్నిరోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు ఈ ప్రాంతంలో తిరగాడుతూ తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఈ విషయమై తమకెలాంటి సమాచారం ఇవ్వలేదని పోలీసులు తెలిపారు.

సీపీఎస్ రద్దుకు డిమాండ్

కల్వకుర్తిరూరల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహరావు తెలిపారు. ఈ నెల 17న నాగర్‌కర్నూల్ జిల్లాలో రథయాత్ర ప్రారంభించి ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్, మండల పరిషత్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆవరణలో రథయాత్ర పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో నెహ్రూ ప్రసాద్, మల్లేష్, రాజేందర్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఏర్పాటుకు వినతి

వెల్దండ: మండలంలోని అంకమోనికుంట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాదులో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. బొల్లంపల్లి పంచాయతీలో ఉన్న అంకమోనికుంట, ఈదమ్మబండతండాలను కలిపి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజునాయక్, జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, భాస్కర్‌రావు, తిర్మల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో శుక్రవారం రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు భూమిపూజ చేశారు. నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.5లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తగా నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నమ్మ, రవీందర్‌రావు, రణబీర్‌సింగ్, మల్లేష్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రారంభం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో శ్మశాన వాటికను సర్పంచ్ నేనావత్ శ్రీరాంతో కలిసి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తుందని అన్నారు.



మన్ననూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వలబాలరాజు

విద్యార్థుల ప్రతిభ

కల్వకుర్తి టౌన్: ఇంటర్ సప్లిమెంటరీతో పాటుగా ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలలో స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాలలో విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. అర్థశాస్త్రంలో వెంకటేష్ 99 మార్కులు, జగదీష్ హిస్టరీలో 98 మార్కులు పొందారు. అదేవిధంగా హెచ్‌ఈసీ విభాగంలో ప్రవళిక 448 మార్కులు ప్రథమ సంవత్సరంలో, ఎంపీసీ విభాగంలో 422, బైపీసీ విభాగంలో 406 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



ప్రవళిక



వెంకటేష్

కోడేరు: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం చదివిన విద్యార్థులు 41మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 25మంది, ద్వితీయ సంవత్సరంలో 16మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

విధుల్లో చేరిన కమిషనర్



అచ్చంపేట రూరల్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరిరాజు శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన బలరాంనాయక్ మక్తల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. దుండిగల్ పురపాలక సంఘంలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన శ్రీహరిరాజు పదోన్నతిపై కమిషనర్‌గా వచ్చారు. గతంలోనూ స్థానికంగా ఈయన ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. చైర్మన్ నర్సింహగౌడ్, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: చైల్డ్ హెల్ప్‌లైన్ 1098లో పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని బీఎస్పీ నాయకులు శుక్రవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ఈ నెల 3న విడుదల చేసిన చైల్డ్ లైన్ ఔట్ సోర్సింగ్ 8 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయగా 290 మంది దరఖాస్తు చేసుకున్నారని, 24–30 మందిని మెరిట్ ప్రకారం ఎంపిక చేశారని, ఇంటర్వ్యూ చేసి 8 మందిని ఫైనల్ చేయాల్సి ఉండగా మెరిట్ లిస్ట్ లేకుండా ఎంపిక చేశారని ఆరోపించారు. ఈ ప్రక్రియ జూన్ 30న చేయగా, ఇంటర్వ్యూ తప్పా మొత్తం ప్రక్రియ వాట్సాప్ గ్రూపుల్లో చేయడం శోచనీయం అన్నారు. దీని వల్ల అర్హత, అనుభవం ఉన్న అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఏమాత్రం అనుభవం లేని వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. బాలబాలికల జీవితాలకు ముడిపడి ఉన్న ఉద్యోగాలు అనర్హత ఉన్నవారికి ఇవ్వడం వల్ల చైల్డ్‌లైన్ పనితీరు నీరుగారే అవకాశం ఉందన్నారు. గతంలో డీసీపీఓ నియామకాల్లో ఇలాగే అవకతవకలు చేశారని, సఖీ కేంద్రంలో గతంలో ఆత్మహత్య కూడా చేసుకున్నారని ఇదంతా అసమర్థతకు నిదర్శనమన్నారు. ప్రస్తుత ఉద్యోగాల్లో ఒకే ఇంట్లో ఇద్దరికి ఇచ్చారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కల్యాణ్, అభ్యర్థులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ


పెద్దకొత్తపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ మోహన్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. క్రైమ్ వివరాలను ఎస్‌ఐ రాముయాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాలలో ఘర్షణలకు తావులేకుండా పోలీసులు పర్యటించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కేసులను ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేయాలని తెలిపారు.

మొక్కల పెంపకానికి సిద్ధం

వెల్దండ: హరితహారంలో భాగంగా మొక్కల పెంపకానికి సిద్ధం కావాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని కేస్లీతండా, కంటోనిపల్లి, మర్రిగుంతతండాల్లో పర్యటించారు. రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడ్ ఉన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

తాడూరు: కేంద్ర ప్రభుత్వం సమాజంలోని పేద ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండా మణెమ్మ తెలిపారు. శుక్రవారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పథకాలపై అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొండానాగేష్, లోహిత్‌రెడ్డి, ఆంజనేయులు, బాలమణెమ్మ, సుధాకర్, శివుడు, సత్యం, నాగరాజు, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం



అచ్చంపేటలో నినాదాలు చేస్తున్న నాయకులు



అమ్రాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తామని ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ మహేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మాదిగలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయన్నారు. వర్గీకరణ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజు, పవన్, కుమార్, ప్రవీణ్, ఆంజనేయులు, భరత్‌ప్రసాద్, రామకృష్ణ, మల్లయ్య, విజయ్, సురేష్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలను శుక్రవారం బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, ఆనంద్, గోపాల్, సైదులుయాదవ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతో పాటు మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలు మండల నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకట్, బాలయ్య, మల్లయ్య, తిరుపతి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంలో కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారి వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

రంగనాయకస్వామికి నృత్య నీరాజనం



కందనూలు: శ్రీపురం రంగనాయకస్వామి ఆలయంలో శుక్రవారం కల్వకుర్తికి చెందిన హరిశ్వర దాండియా బృందం ఆధ్వర్యంలో స్వామివారికి నృత్య నివేదన పేరుతో నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి భక్తిగీతాలు, కీర్తనలకు తమదైన శైలిలో నృత్యంతో మహిళలు నివేదన చేశారు. కార్యక్రమంలో బంగారు బాబు, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, వినోదాచార్యులు పాల్గొన్నారు.

పలకలు, పెన్నులు పంపిణీ

లింగాల: మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పలకలు, పెన్నులను పంపిణీ చేశారు. మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మారుమూల ప్రాంతాల పాఠశాలల విషయంలో చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. రాయవరం పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మన ఊరు–మన బడి పథకంలో గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మల్లయ్య భూమిని అదే గ్రామానికి చెందిన కొంత మంది కబ్జా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆల్ ఇండియా వాల్మీకి పోరాట సమితి అధ్యక్షుడు తిరుమలేష్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన పంట పొలాన్ని పరిశీలించారు. పొలంలో ప్రహరీ నిర్మించుకుంటే కొంత మంది రాత్రికి రాత్రే నేలమట్టం చేయడం సరికాదన్నారు. నిత్యం ఇలాగే గొడవలు పడితే వాల్మీకి తరుపున పోరాటం చేయాల్సి ఉంటుందని అన్నారు. అధికారులు ఈవిషయంపై చర్యలు తీసుకోకపోవడం సరికాదని మండిపడ్డారు.

పెద్దపులి బాధితులకు నష్టపరిహారం

మన్ననూర్: పాడి ఆవులు, కాడెద్దులను పెద్దపులి చంపిన సంఘటనలో బాధితులకు నష్టపరిహారంగా అటవీశాఖ తరుపున మంజూరైన ఆర్థికసాయాన్ని అమ్రాబాద్ ఎఫ్‌డీఓ విశాల్ ఐఎఫ్‌ఎస్ చేతుల మీదుగా మన్ననూర్‌లోని ఎఫ్‌డీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం బాధితులకు అందజేశారు. మేడమోని మల్లయ్యకు రూ.26వేలు, మహమ్మదయ్యకు రూ.8 వేలు, ఇమ్మడి బాల్‌చంద్రయ్యకు రూ.10వేల చొప్పున చెక్కులు అందజేశారు. తప్పని పరిస్థితిలో అడవిలోకి పశువులను తీసుకెళ్తే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆర్డీఓ సేవలు మరువలేనివి



అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో ఆర్డీఓగా విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందిన పాండూనాయక్ సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయనతో పాటు కలెక్టర్ ఉదయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ హాజరై ఘనంగా శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మనోహర్, రాజేశ్వర్‌రెడ్డి, సీఐ అనుదీప్, తహసీల్దార్ కృష్ణయ్య, నయాబ్ తహసీల్దార్ రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఆర్డీఓగా రాజేష్‌కుమార్..

అచ్చంపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓగా కల్వకుర్తి ఆర్డీఓ రాజేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అచ్చంపేట ఆర్డీఓగా విధులు నిర్వర్తించిన పాండూనాయక్ బదిలీపై అందోళ్‌కు వెళ్లారు.

బహుమతుల ప్రదానం

బిజినేపల్లి: మండల కేంద్రంలో నవోదయలో సీటు సాధించిన సాయికిరణ్‌ను ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, క్లాస్‌మెట్ బృందం బుధవారం సత్కరించింది. అదేవిధంగా వివిధ గురుకులాల్లో సీటు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్ శివారులో రైతు తిర్పతయ్యకు చెందిన పాడి ఆవు శుక్రవారం ప్రమాదవశాత్తు పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా షాక్‌తో మృతి చెందింది. ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్లకు చెందిన బీఎస్పీ గ్రామ అధ్యక్షుడు శివకృష్ణతో పాటు 15 మంది నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు.